క్లుప్తంగా

మహిళల సమస్యలకు పరిష్కార వేదిక 'సఖి'



హన్మకొండ చౌరస్తా: సామాజికంగా, కుటుంబపరంగా మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు న్యాయపరమైన పరిష్కారం చూపెట్టడమే సఖి కేంద్రం ముఖ్య ఉద్దేశమని సఖి కేస్ వర్కర్ వినీల అన్నారు. మహిళల హక్కులు, పరిష్కార మార్గాలపై హనుమకొండలోని కొత్తూరు కమ్యూనిటీ హాల్‌లో ఆర్పీ, అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాధిత మహిళలు, బాలికలు 0870 - 2452112 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి రక్షణ పొందాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కేసు



హసన్‌పర్తి: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కేసులు నమోదవుతాయని కార్పొరేటర్ జక్కుల రజిత హెచ్చరించారు. 55వ డివిజన్ భీమారం అంగన్‌వాడీ కేంద్రంలో డివిజన్ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఎనుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిలువేరు కల్పన అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలల పరిరక్షణ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సోషల్ వర్కర్ సునీత, చైల్డ్‌లైన్ టీమ్ మెంబర్ జగన్, రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు విక్టర్‌బాబు, అంగన్‌వాడీ టీచర్లు కీరిట, విజయలక్ష్మి, వసంత పాల్గొన్నారు. కాగా, 14మందితో 55వ డివిజన్ బాలల పరిరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా కార్పొరేటర్ జక్కుల రజిత, కన్వీనర్‌గా కల్పన, సభ్యులుగా జగన్, రాజ్‌కుమార్, సంగాల విక్టర్ బాబు, అటికం రవీందర్, మరో ఎనిమిది మందిని ఎన్నుకున్నారు.

రైతులకు న్యాయం చేయాలి



వరంగల్ లీగల్: బాధిత రైతులకు న్యాయం చేయాలని సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన 40మంది రైతులు కోరారు. ఈమేరకు వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావును బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గవిచర్ల ఎస్సీ కాలనీ నుంచి ఉప్పుకుంట కట్ట మీదుగా సింగం కుంట, వెంగాయ కుంట వైపుగల వ్యవసాయ భూములకు వెళ్లేందుకు పూర్వీకుల నాటి నుంచి దారి ఉండేదని గుర్తుచేశారు. అయితే ఆ దారిని గ్రామస్తులైన వేల్పుల మోహన్, గూడ సుదర్శన్ ధ్వంసం చేసి రైతులను వ్యవసాయ భూములకు వెళ్లకుండా ఇబ్బందులకు గుర్తిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దారిని మూసివేసి, కనీలు పాతి దారిని పూర్తిగా ఆక్రమించుకున్నారని తెలిపారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి



కాశిబుగ్గ: ఏనుమాముల శివారు ముసలమ్మ కుంట సమీపంలోని ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని ఎంసీపీఐ (యూ) కాశిబుగ్గ ఏరియా బాధ్యుడు గోవర్ధన్ రాజ్ డిమాండ్ చేశాడు. కాశిబుగ్గ పార్కులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముసలమ్మకుంటలో 18ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారుల సాయంతో కొంతమంది కబ్జాలకు పాల్పడి విక్రయిస్తున్నారని తెలిపారు. మిగిలిన భూమిలో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఇళ్లు లేని పేదలు గుడిసెలు వేసుకుంటే వాటిని అధికారులు ధ్వంసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు అనూష, ప్రేమలత, రేణుక, నాగరాణి, సుధీర్, కళ్యాణి, అజయ్, అఖిల్, వెంకటేష్, చిన్నస్వామి, పెద్దస్వామి పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజు



హన్మకొండ చౌరస్తా: రాష్ట్రీయ హిందూ పరిషత్ దేవాలయాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండలోని రాగన్నదర్వాజ ప్రాంతానికి చెందిన చీకటి రాజు నియమితులయ్యారు. పెద్దపెల్లి జిల్లాలో బుధవారం జరిగిన రాష్ట్రీయ హిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనంలో రాజుకు ఆర్‌హెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు యుగందర్, ఆర్‌హెచ్‌పీ బాధ్యులు పాల్గొన్నారు.

మౌనముని పీవీకి ఘన నివాళి

ఆర్థిక సంస్కరణల పితామహుడు, గొప్ప పరిపాలనాదక్షుడు, బహుభాషా కోవిదుడు, మౌనముని మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు జయంతి వేడుకలను నగరవ్యాప్తంగా పలువురు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు, డైరెక్టర్లు



కేయూలో పరిపాలన భవనంలో కేయూ వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, తదితరులు



యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, అధ్యాపకులు



జేఎంఎస్ వద్ద నివాళులర్పిస్తున్న కుడా చైర్మన్ సుందర్‌రాజ్, తదితరులు



హనుమాన్ నగర్-1లో పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కాలనీవాసులు

సమస్యల పరిష్కారానికి ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

హన్మకొండ: రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేపట్టనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, యూనివర్శిటీల ఉద్యోగుల యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.వెంకటేష్ తెలిపారు. డైలీ వేజ్, టైం స్కేల్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను క్రమబద్ధీకరించాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 1నుంచి 7వరకు ఆందోళనలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈమేరకు వరంగల్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో మెట్టు రవి అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర సదస్సులో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, యూనివర్సిటీ యూనియన్ నాయకులు కె.చిరంజీవి, శ్రీనివాస్, సమ్మయ్య, రవి, రామచందర్, రఘు, పద్మ, రమ, రమేష్, రాజు, భరత్ పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై పోరాడుదాం



మహాసభలో అభివాదం చేస్తున్న నాయకులు

రామన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని ఏఐకేఎంకేఎస్ నాయకుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా మహాసభను వరంగల్‌లోని నోబుల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. తొలుత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్ర ఆనంద్.. జెండా ఆవిష్కరించారు. అనంతరం రైతు కూలీ ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ న్యూ జాతీయ అధ్యక్షుడు గుర్రం విజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఉప్పలయ్య, మల్లేశం, ఈర్ల పైడి, రాంచందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లను దళితులకే ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాజీపేట అర్బన్: భూములు కోల్పోయిన న్యూశాయంపేట దళితులకు న్యూశాయంపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వాలని సీపీఎం నాయకుడు చుక్కయ్య డిమాండ్ చేశారు. న్యూశాయంపేటలోని ఇందిరాగాంధీ చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూశాయంపేటకు చెందిన 45 దళిత కుటుంబాలు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో తమ భూములను కోల్పోయాయని గుర్తుచేశారు. వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కాజీపేట మండల కార్యదర్శి తొట్టె మల్లేశం, సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, వస్కుల మల్లేశం, కొట్టె శివ, దయాకర్, మూర్తి, లక్ష్మణ్, భాగ్య, వసంత, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించాలి

హసన్‌పర్తి: కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువులను పరిరక్షించాలని జల వనరుల శాఖ ఇంజనీర్ శేషగిరి సూచించారు. 56వ డివిజన్‌లోని దేవాలయ ప్రాంగణంలో వివేక్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'జల వనరులు – వాటి ఆవశ్యకత' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. కాలనీ కమిటీ అధ్యక్షుడు లింగంపల్లి వేణుగోపాల్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శేషగిరి మాట్లాడుతూ చెరువులు, కుంటలను విధ్వంసం చేయడం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగినట్లయితే రానున్న కాలంలో నీటి కోసం యుద్ధాలు తప్పవని హెచ్చరించారు. సామాజిక కార్యకర్త తుపాకుల దశరథం రాసిన గేయ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీంధర్‌నాథ్, పురావస్తు పరిశోధకుడు రాంచర్ల గణపతి, కాలనీ కమిటీ సహాధ్యక్షుడు మీసాల రమేష్, ప్రధాన కార్యదర్శి విజయపాల్, ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలి

ఖిలా వరంగల్: ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంధ్య, మేధావులు, రచయితలు, కళాకారులపై పెట్టిన ఉపా చట్టం కేసులను ఎత్తివేసి, ఆ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత బాలరాజు, బండి కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న వివిధ వర్గాల ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు నల్ల చట్టాలను ప్రయోగిస్తున్నాయని వాపోయారు. ఇటీవల పలువురు మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, ఉద్యమకారులపై రాష్ట్ర ప్రభుత్వం ఉపా చట్టాన్ని ప్రయోగించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, రాజేందర్, సత్యనారాయణ, విజయఖన్నా, సుమన్, హరిబాబు, కృష్ణ, అక్బర్, కుమారస్వామి, అశోక్ పాల్గొన్నారు.

రెండు నెలల్లో పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

హసన్‌పర్తి: కొత్తగా చేపడుతున్న పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను కూడా రెండు నెలల్లో పూర్తిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆదేశించారు. హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో చింతగట్టు క్యాంప్ సమీపంలోని కేఎల్‌ఎన్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. హసన్‌పర్తి, నాగారం సబ్‌స్టేషన్ల పరిధిలోని సమస్యలపై ఎమ్మెల్యేకు నివేదించారు. హసన్‌పర్తి మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు సునీత, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు మేకల భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

హన్మకొండ: అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త జీపు యాత్రకు బుధవారం స్వాగతం పలికింది. ఈ సందర్భంగా నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన సమావేశంలో జయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాసు మాధవి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సునీత, వెంకటమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల చేరికపై దృష్టి పెట్టండి



ప్రధానోపాధ్యాయులతో చర్చిస్తున్న అధికారి రాధ

మడికొండ: పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, హాజరుశాతంపై దృష్టి సారించాలని మడికొండ జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ హెచ్‌లు సంధ్యారాణి, మల్లారెడ్డికి హనుమకొండ మొబిలైజేషన్ అధికారి రాధ సూచించారు. మడికొండలోని పాఠశాలలను ఆమె బుధవారం సందర్శించారు. నూతన విద్యా సంవత్సరం సందర్భంగా విద్యార్థుల నమోదు, హాజరు శాతం, పాఠశాల భౌతిక వనరులపై ఇరువురు ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం రాధ మాట్లాడుతూ బడీడు, బడి బయటి పిల్లలు పాఠశాలల్లో చేరే విధంగా చూడాలని కోరారు. ఎంపీపీఎస్‌కు ప్రత్యేకంగా మానసిక వికలాంగుల కోసం యశోద అనే ఉపాధ్యాయురాలిని నియమించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, మన్నె చంద్రయ్య, రాజేశ్వరి, గ్రామస్తులు పి.కృష్ణమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు, జేఏసీ నాయకులు

హన్మకొండ అర్బన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్లు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ రెండవ పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేసి జూలై 1నుంచి మధ్యంతర భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.లక్ష్మయ్య, కృష్ణప్రసాద్, టి.సుభాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, కృష్ణమూర్తి, రాజేంద్రబాబు, భరత్‌రెడ్డి, వివేక్, మన్నయ్య, పుల్లయ్య, జ్ఞానేశ్వర్, అరుణ, సత్యనారాయణ, రంగయ్య, నర్సింహారావు, సీతారాం, హరికుమారి పాల్గొన్నారు.

యూబ్లడ్ యాప్‌తో రోగికి మేలు

ఎంజీఎం: ప్రాణాపాయస్థితిలో ఉండి, రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి యూబ్లడ్ యాప్ అనేది ఎంతగానో ఉపయోగపడుతుందని యూబ్లడ్ యాప్ సభ్యుడు చిలువేరు శంకర్ తెలిపారు. యూబ్లడ్ యాప్‌పై జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో వైద్యులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రాణపాయ స్థితిలో ఉన్న రోగికి, డోనర్‌కు మధ్య వారధిగా యూబ్లడ్ యాప్ పనిచేస్తుందని వివరించారు. ప్రతీఒక్కరు యూబ్లడ్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని, మరో 10 మందికి అవగాహన కల్పించాలని కోరారు.

సంక్షిప్తంగా

స్థానిక వ్యక్తి ఎమ్మెల్యేగా లేకపోవడమే కారణం



కాజీపేట: స్థానిక వ్యక్తి ఎమ్మెల్యేగా లేకపోవడంతోనే కాజీపేట ప్రాంతం అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడి పోయిందన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి కోరారు. కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురిలోని కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ, మాజీ కార్పొరేటర్లు జక్కుల రమ, తొట్ల రాజుయాదవ్, సుంచు చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ రజాలీ, గుర్రం కోటేశ్వర్, బోయిని కుమార్ యాదవ్, విజయ్‌కుమార్, రంగనాథ్ పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి దోనె గుట్ట ముస్తాబు



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని దోనెగుట్టను గురువారం తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా ముస్తాబు చేశారు. సంతోషలక్ష్మి నరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. ఈక్రమంలో భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, సంతోషలక్ష్మి నరసింహస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల వినతి

కేయూ క్యాంపస్: తమను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు కోరారు. ఈమేరకు హనుమకొండలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ తెలిపారు. కార్యక్రమంలో చందూలాల్, నాగయ్య, శ్రీదేవి, సతీష్‌కుమార్, చాడ స్వామి పాల్గొన్నారు.

లలితా సహస్ర నామాలతో పద్మాక్షిదేవికి అర్చన

హన్మకొండ అర్బన్: శాకంబరి ఉత్సవాల్లో నగరంలోని హనుమద్గిరి పద్మాక్షి దేవికి వేద పండితులు షణ్ముఖ పద్మనాభ అవధాని, నాగిళ్ల శంకర్‌శర్మ, ఆలయ పూజారి నాగరాజు బుధవారం లలితా సహస్ర నామాలతో అర్చనలు నిర్వహించి వైభవంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ఆశీర్వాదాలు పొందినట్లు వారు తెలిపారు.

3న సత్యనారాయణ స్వామి వ్రతాలు

హన్మకొండ కల్చరల్: టీటీడీ, డీపీపీ ఆధ్వర్యంలో జూలై 3న ఆషాఢ పౌర్ణమి గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రచార బ్యానర్‌ను అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ బుధవారం ఆవిష్కరించారు. పలు దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.

బీరన్న బోనాల వైభవాన్ని చాటుదాం

ఖిలా వరంగల్: గురువారం తొలి ఏకాదశి సందర్భంగా గొల్ల కురుమలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బీరన్నస్వామి బోనాల పండుగ వైభవాన్ని నలుదిశలా చాటుదామని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని బీరన్న గుడిలో ఆలయ చైర్మన్, స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి ఎమ్మెల్యే బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీరన్న బోనాల ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ, కోరే కృష్ణ, సందీప్, పూజారి విజయ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బీరన్న బోనాలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో బీరన్న బోనాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య డప్పుచప్పుళ్లతో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీరన్నకు బోనాలు సమర్పించారు. వేడుకల్లో గొల్ల కురుమ కులపెద్దలు కోరె కుమారస్వామి, కాలే యాదగిరి, బక్కయ్య, సమ్మయ్య, పెద్దిరాజు, చిరంజీవి, మారం సదానందం, వేల్పులు సదానందం, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బైరబోయిన ఉమ తెలిపారు. ఈమేరకు వరంగల్ పడమర కోటలో రూ.6కోట్ల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు, కాంట్రాక్టర్లతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నీటి సరఫరా పైపులైన్ల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈ సారంగం, ఏఈ సౌజన్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ శరత్, పుల్లా రాజు, కాంట్రాక్టర్లు శ్రీనివాస్, సమ్మారావు, మల్లయ్య, రాంబాబు, రాజేష్, జవాన్ కుమారస్వామి పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో మాస్టర్‌జీ విద్యార్థుల ప్రతిభ



నయీంనగర్: ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో నగరంలోని కిషన్‌పుర మాస్టర్‌జీ విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ తెలిపారు. 10వ తరగతి విద్యార్థిని సుఫియా రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంక్ సాధించగా, 5వ తరగతి విద్యార్థిని కోమలిసాయి, షణ్ముఖి 5వ ర్యాంక్ సాధించి నగదు పురస్కారం అందుకున్నట్లు వివరించారు. అలాగే, పాఠశాలకు గోల్డెన్ స్కూల్ ఎట్ నేషనల్ లెవల్ -2023 అవార్డుతో పాటు విద్యార్థులు అయాన్ కేసర్, రిషిక, అశ్విక సాయికి ఎక్సలెన్స్ మెడల్ అవార్డులు లభించాయని తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను సుందర్‌రాజ్‌తో పాటు ప్రిన్సిపాల్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, ఏఓ చత్రపాల్‌సింగ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంజీఎం సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యాయత్నం

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఖిలా వరంగల్‌లో నివాసముంటున్న విజయ్.. బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈక్రమంలో చికిత్స నిమిత్తం విజయ్‌ను కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 8మందిని కోర్టులో బుధవారం హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజులపాటు జైలుశిక్ష, ఆరుగురికి రూ.18,100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఫాతిమా తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ కట్కూరి శ్రీధర్, ఎదులాపురం సాంబయ్యకు జైలుశిక్ష విధించినట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతిచెందిన 55వ డివిజన్ భీమారం సత్యసాయి కాలనీకి చెందిన తుమ్మ నారాయణరెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, నాయకులు గోవర్ధన్, సాయి తదితరులు ఉన్నారు.